ఎకో టూరిజం అభివృద్ధికి ప్రణాళిక

- అటవీ, పర్యాటక శాఖ కలిసి పని చేయాలి
- ఐఎఫ్ఎస్ ఖాళీల భర్తీకి కేంద్రానికి విజ్ఞప్తి
- ఉద్యోగుల సాధారణ బదిలీలపై వేసవిలోనే నిర్ణయం
- కాలుష్యం లేని పరిశ్రమలకు ప్రోత్సాహకాలు
- అటవీ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

అధికారుల సమీక్షలో పాల్గొన్న సిఎం రేవంత్, మంత్రి కొండా సురేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అటవీ, పర్యాటక శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఆ రెండు శాఖలూ పర్యాటకులను ఆకట్టుకునేలా వైవిధ్యమున్న ప్రాంతాలను గుర్తించి పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో అటవీ శాఖ అధికారులతో సిఎం సమీక్ష నిర్వహించారు. అందులో అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్, ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ డోబ్రియాల్, సిఎంఒ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సిఎం కార్యదర్శి చంద్ర శేఖర్ రెడ్డి, తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ..అటవీ అందాలు, వన్య ప్రాణులు, వలసొచ్చే విదేశీ పక్షులు, విభిన్న జీవ వైవిధ్యమున్న ప్రాంతాలు, హెరిటేజ్ ప్రదేశాలు, సంస్కృతికి అద్దం పట్టే ప్రాంతాలన్నింటినీ గుర్తించి అభివృద్ధి చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో అడవులతో ముడిపడి ఉన్న ప్రకృతి అందాలకు, పర్యాటక ప్రాంతాలకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు సాధించేలా ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. అవసరమైతే ప్రత్యేక కన్సల్టెన్సీ నియమించి ప్రతిపాదనలు తయారు చేయించాలని సూచించారు. ఉత్తర తెలంగాణలో కవ్వాల్, దక్షిణ తెలంగాణ వైపు అమ్రాబాద్ టైగర్ రిజర్వు ప్రాజెక్టులను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు. వన్య ప్రాణులకు హాని కలిగించకుండా ప్రత్యేక పర్యాటక విధానం తయారు చేయాలని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో అటవీ ప్రాంతాల్లోనే పర్యాటకులు విడిది చేసే ప్రాజెక్టులు కూడా ఉన్నాయనీ, వాటిని అధ్యయనం చేసి, అక్కడ అనుసరిస్తున్న రక్షణ, భద్రత చర్యలను రాష్ట్రంలోనూ అమలయ్యేలా చూడాలని సూచించారు.

ఇతర శాఖలకు డిప్యూటేషన్ వెళ్లిన వారి వివరాలివ్వండి

రాష్ట్రానికి మంజూరైన 81 మంది ఐఎఫ్ఎస్ పోస్టుల్లో ప్రస్తుతం 55 మంది మాత్రమే ఉన్నారని, మిగతా 26 ఐఎఫ్ఎస్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చర్చ జరగ్గా.. సరిపడ సంఖ్యలో ఐఎఫ్ఎస్‌లను కేటాయించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తామని సిఎం చెప్పారు. అటవీ శాఖ నుంచి డిప్యూటేషన్‌పై వెళ్లి ఇతర విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగుల వివరాలను వెంటనే సమర్పించాలని సిఎం ఆదేశించారు. వసరమైతే వెంటనే వారిని వెనక్కి రప్పించే చర్యలు చేపడుతామన్నారు. ఒకే చోట పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీ చేయాలనీ, అందుకు వీలుగా బదిలీలపై నిషేధం ఎత్తేయాలని అధికారులు సిఎం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సీఎం స్పందిస్తూ పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత బదిలీల ప్రక్రియపై నిర్ణయం తీసుకుంటామని హామీనిచ్చారు. ఉద్యోగుల పిల్లల చదువులకు కూడా ఇబ్బంది లేకుండా వేసవిలోనే బదిలీల ప్రక్రియ పూర్తి చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఒక్క అటవీ శాఖలోనే కాకుండా అన్ని విభాగాల్లోనూ చాలా ఏండ్లుగా ఒకే చోట పాతుకుపోయిన ఉద్యోగులను బదిలీ చేసేలా సాధారణ బదిలీలకు మార్గదర్శకాలు కూడా తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.

అడవుల్లోని ఖాళీ ప్రాంతాల్లో మొక్కలు పెంచండి

రాష్ట్రంలోని నర్సరీల్లో దాదాపు 22 కోట్ల మొక్కలు అందుబాటులో ఉన్నాయని అధికారులు సిఎంకు నివేదించారు. జూన్‌లో వర్షాకాలం ఆరంభంలో వీటిని నాటేందుకు ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. అడవుల్లో చెట్ల నరికివేతతో ఖాళీ అయిన ప్రాంతాల్లో మొక్కలు పెంచాలని, అవసరమైతే అక్కడే బోర్లు వేయించి నీరు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆక్రమణకు గురవుతున్న అటవీ భూముల చుట్టూ కాంపౌండ్ వాల్, ఫెన్సింగ్ వేసి కాపాడే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కేంద్రం నుంచి వచ్చే కాంపా నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జీరో పొల్యూషన్ సంస్థలకు ప్రశంసాపత్రాలివ్వండి

కాలుష్య నిబంధనలు, ప్రమాణాలను పాటించే పరిశ్రమలను ప్రోత్సహించాలని సిఎం అన్నారు. ప్రతి ఏడాది పర్యావరణ దినోత్సవం లాంటి సందర్భాన్ని పురస్కరించుకొని జీరో పొల్యూషన్ పాటించే సంస్థలకు ప్రశంసా పత్రాలను అందించాలని సూచించారు. కరీంనగర్, వరంగల్, ఖమ్మం నగరాలకు అందుబాటులో ఉండేలా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, విద్యుత్తు ఉత్పత్తి చేసే ప్లాంట్లను ఏర్పాటు చేయాలనీ, ఎక్కడ అనువైన ప్రాంతాలున్నాయో పరిశీలించి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. నిబంధనలను అతిక్రమించి ప్లాస్టిక్ తయారు చేసే పరిశ్రమలకు నోటీసులు ఇవ్వాలనీ, భారీగా జరిమానాలు విధించాలని ఆదేశించారు.

12 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

- ముదురుతున్న ఎండలు
- అక్కాపూర్‌లో అత్యధికంగా 40.9 డిగ్రీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎండలు రోజురోజుకీ ముదిరిపోతున్నాయి. 15 జిల్లాలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నిర్మల్ జిల్లా అక్కాపూర్‌లో అత్యధికంగా 40.9 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. ఎండ తీవ్రత నేపథ్యంలోనే వాతావరణ శాఖ 12 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆ జాబితాలో నిర్మల్, జోగులాంబ గద్వాల, నిజామాబాద్, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, కొమ్రంభీం అసిఫాబాద్, వనపర్తి, జగిత్యాల, వికారాబాద్, ఆదిలాబాద్, హైదరాబాద్ జిల్లాలున్నాయి. రాజన్నసిరిసిల్ల, ములుగు, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోనూ 40 డిగ్రీలు దాటింది. హైదరాబాద్ పరిధిలో బేగంపేటలో అత్యధికంగా 40.2 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలో వచ్చే ఐద్రోజుల పాటు వాతావరణం పొడిగా ఉంటుందనీ, అయితే, అక్కడక్కడా తేలికపాటి నుంచిమోస్తరు వానలు పడే సూచనలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది.

కన్హా శాంతివనంలో ఆధ్యాత్మిక మహోత్సవం

- హాజరైన రాష్ట్రపతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవ కార్యాక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ హార్ట్ ఫుల్‌నెస్ సహకారంతో రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని కన్హా శాంతివనంలో నాలుగు రోజులపాటు ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరై శాంతివనాన్ని సందర్శించారు. ఆధ్యాత్మికతపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆమె తిలకించారు. శాంతివనంలో మొక్కను నాటారు. కార్యక్రమానికి న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్, స్వామి చిదానంద సరస్వతి, చిన్న జీయార్ స్వామి, స్వామి ముకుందానంద, యోగి నిరంజన్ దాస్, నమ్రముని మహారాజ్, దాజి, దేవి చిత్ర లేఖ, తారాచంద్ కంటాలే తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో హైదరాబాద్ వచ్చిన రాష్ట్రపతికి విమానాశ్రయంలో గవర్నర్ తమిళిసై, సిఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఉన్నతాధికారులు స్వాగతం పలికారు.

వంద రోజుల్లో ఐదు గ్యారంటీలకు శ్రీకారం

- రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వంద రోజుల కాంగ్రెస్ పాలనలో ఐదు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టినట్టు రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. డిసెంబర్ 7న అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో జరిగిన తప్పిదాలను సరిచేస్తూ, ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తున్నామని వివరించారు. ఈ మేరకు వంద రోజుల పాలనపై పొంగులేటి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో విధ్వంసమైన తెలంగాణను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కో అడుగు ముందుకేస్తూ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తోందని తెలిపారు. తాము అధికారం చేపట్టిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సాయం పరిమితిని రూ.10 లక్షలకు పెంచి చరిత్ర సృష్టించిచామని వివరించారు. 80 రోజుల్లో గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు సదుపాయం, తెల్ల రేషన్ కార్డు కలిగిన 40 లక్షల మంది మహిళలకు రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందించే మహాలక్ష్మి ఎల్‌పిజి పథకాన్ని అమలు చేశామని పేర్కొన్నారు. 90 రోజుల్లో 5వ గ్యారంటీగా ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. ఈ పథకం కింద నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున 4.5 లక్షల ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మూడు నెలల్లోనే 29 వేలకుపైగా ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేయడంతోపాటు వయోపరిమితి పెంచామని వివరించారు. భూ సమస్యలకు శరఘాతంగా మారిన ధరణి పోర్టల్‌ను ప్రక్షాళన చేసేందుకు ఐదుగురు సభ్యులతో పునర్నిర్మాణ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

భువనగిరి బరిలో సిపిఎం

- పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య
- ప్రజల భవిష్యత్తు ఎన్నికలపై ఆధారపడి ఉంది : చెరుపల్లి, జూలకంటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి సిపిఎం పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని వెన్నెల కళాశాలలో శుక్రవారం జరిగిన సిపిఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి.. కుల, మతాల పేరుతో ప్రజల మధ్య చీలికలు తీసుకొచ్చి వైషమ్యాలను రెచ్చగొట్టి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడం, ప్రభుత్వ రంగంలో ప్రయివేటు వ్యక్తుల వాటాలు పెంచడం ద్వారా ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే కుట్రలు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలక్టోరల్ బాండ్స్ పేరుతో బిజెపికి వేల కోట్ల రూపాయల విరాళాలు అందాయని తెలిపారు. పాలకవర్గ స్వభావాన్ని తక్కువగా అంచనా వేయవద్దని, ప్రజా సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మూడుసార్లు కలిసామని, నేటికీ ఒక్క సమస్యా పరిష్కారం కాలేదని అన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. దేశ ప్రజల భవిష్యత్తు ఈ ఎన్నికల ఫలితాలపై ఆధారపడి ఉందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజా సమస్యలే తమ ఎజెండాగా నిరంతరం ప్రజల తరపున పనిచేసే సిపిఎం అభ్యర్థికి ఓటువేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. బిజెపి అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. రైతు చట్టాలకు వ్యతిరేకంగా 1100 మంది రైతులు మృతి చెందితే తప్ప ప్రధాని వెనకడుగు వేయలేదని విమర్శించారు. దేశాన్ని అప్పుల పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం వ్యక్తం చేశారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, రాష్ట్ర కమిటీ కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మంగ నరసింహులు, మాటూరు బాలరాజు, కల్లూరి మల్లేశం, దోనూరు నర్సిరెడ్డి, దాసరి పాండు, తదితరులు పాల్గొన్నారు.

'కెసిఆర్ సార్.. భువనగిరి ఎంపి టికెట్ ఇచ్చి గెలిపించండి'

- తెలంగాణ అమరులు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ

అమరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న శంకరమ్మ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ నుంచి తనకు భువనగిరి ఎంపి అభ్యర్థిగా అవకాశం ఇచ్చి గెలిపించాలని మలిదశ తెలంగాణ తొలి అమరుడు శ్రీకాంతా చారి తల్లి కాసోజు శంకరమ్మ మాజీ సిఎం కెసిఆర్‌ను కోరారు. శుక్రవారం హైదరాబాద్ గన్‌పార్క్ వద్దనున్న అమరవీరుల స్తూపం వద్ద శ్రీకాంతా చారి చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. భువనగిరి అసెంబ్లీ స్థానానికి బిఆర్ఎస్ పార్టీని టికెట్ అడిగామని తెలిపారు. టికెట్ ఇవ్వడం తెలంగాణ అమరవీరులకు ఇచ్చే గౌరవమన్నారు. అన్ని పార్టీలు కూడా అభ్యర్థులను ప్రకటించకుండా తనకు మద్దతు ఇవ్వాలన్నారు. రాష్ట్రం కోసం ప్రాణాలిచ్చిన అమరుల కుటుంబాలకు పదేండ్లుగా న్యాయం జరగలేదని, తన బిడ్డతో పాటు 1000 మంది బిడ్డలు అమరులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కుటుంబాలకు ఇప్పటి వరకు చట్టసభల్లో కనీసం నామినేటెడ్ పదవులు కూడా రాలేదన్నారు. ఉద్యమ ద్రోహులకు బిఆర్ఎస్ పదవులు ఇచ్చిందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేయని వారు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు అయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అన్ని రాజకీయ పార్టీలు అమరవీరుల కుటుంబాలను గుర్తించాలన్నారు. రాష్ట్రం కోసం ప్రాణాలు త్యాగం చేసిన శ్రీకాంతా చారి తల్లిగా ఎంపి ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలని అన్ని రాజకీయ పార్టీలను కోరుతున్నానని తెలిపారు. ఒకవేళ ఏ పార్టీ టికెట్ ఇవ్వకపోతే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని ప్రకటించారు.

మల్కాజిగిరిలో మోడీ రోడ్ షో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మల్కాజిగిరిలో ప్రధాని నరేంద్ర మోడీ రోడ్ షో నిరాశపర్చింది. మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలోని మల్కాజిగిరి నియోజకవర్గంలో శుక్రవారం ప్రధాని నరేంద్ర మోడీ విజయ సంకల్ప రోడ్ షో నిర్వహించారు. ఈ రోడ్ షో సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా.6.15కు ప్రారంభమైంది. మిర్జాలగూడ చౌరస్తా నుంచి మల్కాజిగిరి చౌరస్తా వరకు దాదాపు 1.3 కిలో మీటర్లు మోడీ రోడ్ షో కొనసాగింది. గోషామహల్‌తో సహా సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బిజెపి శ్రేణులకు మూడు గంటల ఆలస్యం ఇబ్బందులకు గురిచేసింది. మోడీ పర్యటనను పురస్కరించుకుని బందోబస్తు పేరిట మల్కాజిగిరి అసెంబ్లీ పరిధిలోని పలు ప్రాంతాలను, ప్రధాన రోడ్లను దిగ్బంధించారు. రోడ్ షోలో మోడీ అభివాదమే తప్ప. ఉలుకు, పలుకు లేకుండా మౌనంగా రోడ్ షో ముగించటం పట్ల ప్రజలు అసహనానికి గురయ్యారు. ఈ రోడ్ షోలో ప్రధాని మోడీ వెంట బిజెపి మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్, సికింద్రాబాద్ అభ్యర్థి జి.కిషన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాం చందర్ రావు, బిజెపి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రూరల్ అధ్యక్షులు విక్రమ్ రెడ్డి పాల్గొన్నారు.

ఐదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతి

- 18 నుంచి టెన్త్ పరీక్షలు
- 5,08,385 మంది హాజరు
- 2,676 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- 30 వేల మంది ఇన్విజిలేటర్లు
- కంట్రోల్ రూం ఏర్పాటు
- ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు కృష్ణారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ నెల 18 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. వచ్చేనెల రెండో తేదీ వరకు జరుగుతాయి. ఐదు నిమిషాలు ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉదయం 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభమవుతాయి. 9.35 గంటల వరకు విద్యార్థులకు గ్రేస్ పీరియడ్‌తో అనుమతిస్తారు. ఆ తర్వాత అనుమతి ఉండబోదని అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 11,469 పాఠశాలల నుంచి 5,08,385 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. వారిలో 2,57,952 మంది అబ్బాయిలు, 2,50,433 మంది అమ్మాయిలున్నారని వివరించారు. వారి కోసం 2,676 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోజిట్ కోర్సు సబ్జెక్టు మాత్రం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. సైన్స్ సబ్జెక్టును రెండు విడతల్లో రెండు రోజులపాటు నిర్వహిస్తున్నామని వివరించారు. ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్‌ను సబ్జెక్టులను వేర్వేరు రోజుల్లో ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. 2,676 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 2,676 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 30 వేల మంది ఇన్విజిలేటర్లను నియమించామని పేర్కొన్నారు. విద్యార్థుల హాల్‌టికెట్లను ఇప్పటికే ఆయా పాఠశాలలకు పంపించామని తెలిపారు. ష్ఠ్ఠ.ఎంవ్.వశ్రీఖఅ-స్త్రుఖు.స్త్రశీఙ.ఱఅ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుల కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామనీ, సమస్యలుంటే 040-23230942 నెంబర్‌ను సంప్రదించాలనీ, డిఇఒ కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని వివరించారు. విద్యార్థులను ఉదయం 8.30 నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామనీ, సకాలంలో చేరుకోవాలని కోరారు. పరీక్షలు ప్రారంభమయ్యే ఒకటి లేదా రెండు రోజుల ముందు పరీక్షా కేంద్రాలకు వెళ్లి చూసుకోవాలని తెలిపారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు జిల్లా స్థాయి పరిశీలకులను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ నియమించారని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు పోలీసుల బందోబస్తు ఉంటుందని వివరించారు. పరీక్ష జరిగే సమయంలో ఆ ప్రాంతంలోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని ఆదేశించారు. మాల్‌ప్రాక్టీస్‌లను నివారించడం పరీక్షల పర్యవేక్షణకు 144 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించామనీ, సమస్యాత్మక కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌లను డీఈవోలు నియమించారని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులు, సిబ్బంది మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను తేవడాన్ని నిషేధించామని పేర్కొన్నారు. హాల్‌టికెట్, ప్యాడ్, పెన్, పెన్సిల్, స్కేల్, షార్ప్‌నర్, ఎరేసర్, జామెట్రీ పరికరాలను అనుమతిస్తామని వివరించారు. పరీక్షల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సీసీఏ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జోడేఘాట్‌ను సందర్శించిన మంత్రి సీతక్క

- పోరాట యోధుడు భీమ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదివాసుల ఆరాధ్యదైవం, పోరాట యోధుడు అసువులు బాసిన పోరుగడ్డ జోడేఘాట్‌ను శుక్రవారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సందర్శించారు. గ్రామస్తులు మంత్రిని డప్పు, వాయిద్యాల నడుమ ఘనస్వాగతం పలికారు. అనంతరం అమరుడు కుమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ట్రైబల్ మ్యూజియంలో కలియ తిరిగి, మ్యూజియంలో ప్రదర్శనకు ఏర్పాటు చేసిన ఆదివాసీ గిరిజన సంప్రదాయ వస్తువులు, వ్యవసాయ పనిముట్లు, గిరిజన సాంస్కృతిని ప్రతిబింబించే అలంకార ఆభరణాలు, తదితర వస్తువులను తిలకించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమయ్యారు. పోరు గ్రామాల పెద్ద కుమురం భీమ్ ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పెందూర్ రాజేశ్వర్, కోరేంగా గోవింద్ రావు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వివరించారు. హట్టి నుంచి టోకెన్ మోవాడ్ వరకు అటవీ అనుమతులు లేక రోడ్డు పనులు అసంపూర్తిగా ఆగిపోయాయని తెలిపారు. పోరు గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. జోడేఘాట్ నుంచి దెంబటిగూడెం 3 కి.మీ దూరంలోనే ఉంటుందని, రోడ్డు సౌకర్యం కల్పిస్తే ఆసిఫాబాద్‌కు కేవలం 13 కి.మీ దూరం మాత్రమే ఉంటుందని, రవాణాపరంగా సౌకర్యంగా ఉంటుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అదే విధంగా గత ప్రభుత్వం జోడేఘాట్ గ్రామానికి 30 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మంజూరు చేసిందని, గ్రామస్తులే సొంత ఖర్చులతో రూఫ్ లెవెల్ వరకు నిర్మాణం పూర్తి చేసుకున్నారని తెలిపారు. వాటికి సంబంధించిన సగం బిల్లులు రావాల్సి ఉందని, పెండింగ్ బిల్లులు ఇప్పించాలని వేడుకున్నారు. వేసవిలో ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు 400 మీటర్ల లోతుకు అడుగంటి పోతాయని, నీటి ఎద్దడి తీర్చేందుకు బోర్లు వేయించాలని కోరారు. అలాగే మూగజీవాల దప్పిక తీర్చేందుకు చెరువు నిర్మాణం చేపట్టాలని విన్నవించారు. గ్రామస్తుల సమస్యలను విన్న మంత్రి సమీప గ్రామ ప్రజలతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి జోడేఘాడ్ ప్రాంతంపైన ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలిపారు. పోరు గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి సీతక్క అన్నారు. మంత్రి వెంట కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ సురేష్‌కుమార్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, డీఎస్పీ సదయ్య, భీమ్ మనుమడు సోనిరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కొక్కిరాల విశ్వప్రసాద్, జడ్పీ చైర్మెన్ కోనేరు కృష్ణ, వాంకిడి సీఐ శ్రీనివాస్, కెరమెరి ఎస్ఐ గుంపుల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బిజెపి అడ్డంగా దొరికిపోయింది

- పిసిసి ఎస్‌సి సెల్ చైర్మన్ ప్రీతం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎలక్ట్రోరల్ బాండ్ల విషయంలో బిజెపి అడ్డంగా దొరికిపోయిందని పిసిసి ఎస్‌సి సెల్ చైర్మన్ ప్రీతం విమర్శించారు. బాండ్లను గోప్యంగా ఉంచి బిజెపి మోసం చేసిందన్నారు. 1300 కంపెనీలు ఆరు వేల కోట్ల ఎలక్ట్రోరల్ బాండ్లను బిజెపికి ఇచ్చారని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. దేశంలో క్విడ్ ప్రోకో, మని లాండరింగ్‌ను బిజెపి ప్రోత్సహించిందని విమర్శించారు. ఆయా కంపెనీల మీద ఐటి దాడులు చేయించి, బాండ్లను కొనిపించిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు ప్రధాని మోడీ హైదరాబాద్ వచ్చారని విమర్శించారు. ఎస్‌సి వర్గీకరణకు పార్లమెంట్‌లో బిల్లు పెడతామని చెప్పి మాదిగలను మోడీ మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

IN THE COURT OF THE V JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 2628 of 2023

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its SrManager(Law)&Authorized Officer,
...Plaintiff
And
Sri. K.Jaya Raju
...Defendant

To
Sri. K.Jaya Raju , Sio.K.Narasimha murthy, Aged about 51 years, Om Business, R/o. A.P. Genco. KTPS 'A' Colony, QNo.G-3, New Paloncha, Khammam, Andhra Pradesh-507115.

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.4,17,909-01ps towards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 22-03-2024. In case of your failure to attend before the Court on 22-03-2024 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju
& Associate
Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts,
Opp: R.S.Brothers, Chandanagar,
Gangaram Village, HYDERABAD-50.

IN THE COURT OF IIND ADDL. DISTRICT JUDGE CUM MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL, KURNOOL AT: ADONI
I.A. No.135/2024 IN M.V.O.P. No.29/2022

Boya Narayanamma and 4 Others
....Petitioners
VS
Usmantulla Rohith and 3 Others
....Respondents

NOTICE TO THE RESPONDENTS NO. 1,2 and 3.

To,
Respondent No.1.
Usmantula Rohith S/o U. Usenappa, Hindu, Aged about 26 Years, driver of DCM bearing NO. TS 34 TA 3123, H.NO. 5-34/1, Kandlakoya, N/R Medical Check post, Medchal, M- GIRI, Telangana State.
Respondent No.2.
Sattar Kishore S/o S. Venkatesh, Hindu, Major, Owner of DCM bearing NO. TS 34 TA 3123, H.No. 3-52, Kandlakoyy Gowdavalli, Quithubullapur, Medchal M-GIRI, Hyderabad, Telangana State.
Respondent No.3.
Pitala Sai Kumar S/O K.V. Ranga Redy Hindu, Major, Policy holder of DCM bearing NO. TS 34 TA 3123, H.No. 5-129, Flat No. 302, 3rd Floor, Road No. 19, Panchasheel Enclave, Old Alwal, Alwal, Telangana State.

Whereas the above named petitioners filed petition Under Section 166 (1) of Motor Vehicles Act for claiming compensation against yours for the death of the deceased Mekala Nalanna who died in the accident. Hence you are hereby required to appear before this court on 21.03.2024 at 10.30 AM in person or through an advocate and answer the said claim petition, otherwise the matter will be decided exparte.

(By Court Order)
V. Lakshmaiah,
B. Com. B.L., Advocate,
Yemmiganur Town,
Kurnool Dist.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT BHEEMUNIPATNAM
E.P. 22/2022 O.S. 245/2019

Between:
Nunna Srinivasa Rao . . . Plaintiff
And:
Katakam Surya Prakasha Rao.
. . . Defendant

To,
J.Dr:
Katakam Surya Prakasha Rao,
S/o late Venkata Ramanayya,
Aged 66 years, Flat No. 4122,
Tower 4, Floor 12,
Sumadhura Horizon,
Masjid Banda Road, Kondapur,
Hyderabad - 500084
Telangana State.

Whereas the above named D.Hr filed the above E.P. for realization of an amount of Rs.18,97,676.00 Ps from you after conducting sale of the schedule property an extent of 958 sq yards amongst other reliefs and you are hereby directed to appear before the above mentioned court on **22-04-2024 by 10:30 A.M.** Failing which the matter will be heard and decided ex-parte.

(By order of the court),
Sri. **P. VENKATESWARA RAO,**
Sri. **B.A. RAJU,**
Sri. **A. SHARAD KUMAR,**
Advocates,
Bheemunipatnam.

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ వారి సమక్షంలో, కోయంబత్తూర్ వద్ద
జవాన్స్ భవన్, 2వ& 3వ అంతస్తు, నం.27,
ట్రావెలర్స్ బంగ్లా రోడ్, కోయంబత్తూర్-18.
ఓ.ఏ.నం.66 ఆఫ్ 2024

మెసర్స్ పంజాబ్ నేషనల్ బ్యాంక్,
(ఇటీవలి యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)
ప్రతినిధియైన దీని బ్రాంచి మేనేజర్,
సర్కిల్ సాస్త్రా సెంటర్, కోయంబత్తూర్ వద్ద
.....దరఖాస్తుదారు
మరియు

1. శ్రీ కన్నెగంటి సుధీర్ కుమార్,
తండ్రి కె. నాగేశ్వర రావు,
నివాసం: ఇ.నం.18-89, ఎంఎల్ఆర్ కాలనీ,
శివాలయం దగ్గర, దమ్మాయిగూడ, నాగారం,
కె.వి.రంగారెడ్డి, తెలంగాణ-500 083.
మరియు: ఇ.నం.8/4, 2వ వీధి,
ఎం.కె.పి.కాలనీ, మన్యకరంపాలాయం, గణపతి,
కోయంబత్తూర్-641 006.

2. శ్రీమతి నాగలక్ష్మి కన్నెగంటి,
భర్త శ్రీ కన్నెగంటి సుధీర్ కుమార్,
నివాసం: ఇ.నం.18-89, ఎంఎల్ఆర్ కాలనీ,
శివాలయం దగ్గర, దమ్మాయిగూడ, నాగారం,
కె.వి.రంగారెడ్డి, తెలంగాణ-500 083.
మరియు: 42/34-1 పి నం.24, స్ట్రీట్ నం.1,
గాయత్రి నగర్, మీర్‌పేట్, మౌలాలి,
రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్-500 040.
మరియు: ఇ.నం. 8/4, 2వ వీధి,
ఎం.కె.పి.కాలనీ, మన్యకరంపాలాయం, గణపతి,
కోయంబత్తూర్-641 006. ...ప్రతివాదులు
మధ్య.

ప్రతివాదులకు ప్రకటన

పై పేరుగల దరఖాస్తుదారు అయిన బ్యాంకు వారు, ఆర్‌డిడిబిఎఫ్ఐ చట్టం, 1993 యొక్క సెక్షన్ 19 క్రింద దరఖాస్తును దాఖలుచేశారు మరియు దానిని పై పేర్కొన్న ప్రతివాదులకు విరుద్ధంగా నగదును రికవరీచేయుట కొరకు పై సదరు ట్రిబ్యునల్ వారి సమక్షంలో నంబరువేశారు. కేసును **ఓ.ఏ.నం. 66 ఆఫ్ 2024** లో ఫైల్ పై తీసుకున్నారు మరియు గౌరవ కోర్టువారు వారిని స్వయంగా లేదా న్యాయవాది ద్వారా **26.03.2024న ఉ॥ 11.00గం.లకు** మీరు హాజరై, కేసు విచారణ కొరకు పై పేర్కొన్న తేదీన మీరు హాజరవవలసిందిగా కోరబడుచున్నది. ఏదైతే విఫలం చెందినట్లైతే, పై సదరు కేసును మీ గైర్హాజరులో నిర్ణయం తీసుకోబడుతుంది.

// కోర్టు ఆదేశానుసారం//
కె. శివకార్తికేయన్, ఎం.కాం., బి.ఎల్.,
న్యాయవాది,
శ్రీసాయి లా ఫర్మ్, నం.4411,
ముత్తు కాంప్లెక్స్, పుష్పా థియేటర్ బస్టాప్ దగ్గర,
పి.ఎన్.రోడ్,
తిరుపూర్-641 602.
సెల్: 98659 22333.

ఖమ్మంలో 'హస్తం' పంచాయితీ!

- కాంగ్రెస్ ఎంపి సీటుపై సందిగ్ధత
- పార్టీ పెద్దల చుట్టూ నేతల చక్కర్లు
- మంత్రుల కుటుంబీకుల్లో ఎవరికి ఇవ్వాలో తెలియని స్థితి
- ఒకరికిస్తే మరొకరి సహకారంపై అనుమానం
- మధ్యేమార్గం ఎంచుకున్నా సమన్వయంపై సందేహాలు
- అధిష్టానానికి సవాల్‌గా టికెట్ కేటాయింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం పార్లమెంట్ టికెట్ కేటాయింపు కాంగ్రెస్ అధిష్టానానికి సవాల్‌గా మారింది. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆ పార్టీ అభ్యర్థులు, మద్దతుదారులు మొన్నటి ఎన్నికల్లో భారీ విజయాలను సాధించడంతో ఈ సీటుపై ఆసక్తి తారాస్థాయికి చేరింది. ఓవైపు ముగ్గురు మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తమ కుటుంబీకుల కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తుండగా మరోవైపు ఇతర ఆశావహులు సైతం కాంగ్రెస్ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మంత్రుల కుటుంబీకుల్లో ఏ ఒక్కరికి ఇచ్చినా మిగిలిన ఇద్దరు మంత్రులు ఏ మేరకు సహకరిస్తారనేది చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతానికి ముగ్గురు మంత్రుల మధ్య సమన్వయం ఉంది. భవిష్యత్తులోనూ వీరి మధ్య పరస్పర సహకారం కొనసాగటం ఈ టికెట్ కేటాయింపుపైనా ఆధారపడి ఉంటుందనే చర్చ పార్టీ శ్రేణుల్లో కొనసాగుతోంది.

టిక్కెట్ కోసం జోరుగా పైరవీలు..

ఖమ్మం ఎంపి టికెట్ కోసం జోరుగా పైరవీలు కొనసాగుతున్నాయి. మంత్రులు తమ కుటుంబీకుల కోసం ప్రయత్నాలు సాగిస్తూనే.. తమ వారికి దక్కని పక్షంలో ఎవరికి ఇవ్వాలో కూడా సూచిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఎన్‌టివి అధినేత నరేంద్రచౌదరిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దగ్గరకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం తీసుకువెళ్లడం చర్చనీయాంశమైంది. అయితే ఇది టికెట్ కోసం కాకపోవచ్చు.. మర్యాదపూర్వకంగా అయివుండొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు వీవీసీ సంస్థల అధినేత వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ కూడా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మొన్న కర్నాటక ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్‌ను కలిస్తే...గురువారం రాయచూర్‌లో రాహుల్‌గాంధీని కలిసినట్లు తెలుస్తోంది. ఖమ్మం టికెట్ విషయంలోనే తనకున్న అర్హతలను వివరిస్తూ.. మాజీ ఎంపి వి హనుమంతరావు సైతం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కపై ఇటీవల విమర్శలు చేశారు. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుంకుమార్ సైతం కొద్దిరోజుల క్రితం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖమ్మం టిక్కెట్‌పై తనకున్న ఆసక్తిని వెల్లడించారు. రేణుకాచౌదరిని రాజ్యసభకు ఎంపిక చేసినా ఖమ్మం సీటుపై ఆశావహుల సంఖ్య భారీగా పెరుగుతుండటం గమనార్హం. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మినహా మిగిలిన ఖమ్మం ఎంపీలంతా స్థానికేతరులేనన్న గత చరిత్రను కూడా కాంగ్రెస్ అధిష్టానం దగ్గర ఉంచి టిక్కెట్ ప్రయత్నాలు చేసుకుంటున్నవారూ ఉన్నారు.

ప్రసాద్ రెడ్డి

తుమ్మల యుగంధర్

ఆ మూడు అంశాలు కీలకం..

ఖమ్మం ఎంపి టికెట్ విషయంలో అంగ అర్థబలంతో పాటు ఆ నేత ఏమేరకు సమన్వయం చేసుకోగలరనే మూడు అంశాలు కీలకంగా మారనున్నాయి. ఈ లెక్కన ముగ్గురు జిల్లా మంత్రులు ఒకరికొకరు తీసిపోని విధంగా ఉన్నారు. 13 లక్షలకు పైగా ఓట్లున్న ఖమ్మం పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్‌కు ఎంత బలమున్నా తక్కువలో తక్కువ రూ.100 కోట్లకు పైగా వెచ్చిస్తేనే గెలుపు అవకాశాలున్నాయి. ఎందుకంటే ప్రత్యర్థి పార్టీల నుంచి పోటీ చేసే బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు, బిజెపి టికెట్ ఆశిస్తున్న జలగం వెంకట్రావు, డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు సైతం ఖర్చు విషయంలో వెనక్కి తగ్గే అవకాశం లేదనే అంచనాలు ఉన్నాయి. దీన్నిబట్టి అర్థబలం ఎంత కీలకమో అర్థం చేసుకోవచ్చు. ముగ్గురు మంత్రుల్లో ఆర్థికపరమైన అంశంలో పొంగులేటి ముందున్నారు. ఇక అంగబలం విషయానికొస్తే ముగ్గురికి ముగ్గురు సమ ఉజ్జీలైనా.. ఒకరికి టిక్కెట్ ఇస్తే మిగిలిన ఇద్దరు ఏకమైనా ఆశ్చర్యపోనక్కర్లేదనే చర్చ ఆ పార్టీలో సాగుతోంది. అలాంటిదేమీ లేకుండా ప్రస్తుతమున్న సమన్వయాన్నే కొనసాగిస్తామనే సంకేతం ముగ్గురు మంత్రుల నుంచి అధిష్టానానికి వెళ్లినప్పుడే కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థిత్వం నిర్ధారణయ్యే అవకాశం ఉంది. మంత్రులు పొంగులేటి సోదరుడు ప్రసాదరెడ్డికి కాకుండా భట్టి సతీమణి మల్లు నందినికీ లేకుండా తుమ్మల తనయుడు యుగంధర్‌కూ దక్కకుండా నాలుగో వ్యక్తికి ఎవరికిచ్చినా ఈ ముగ్గురు మంత్రులు వారికి ఎంతమేరకు సహకరిస్తారనే అంశంపైనే కాంగ్రెస్ గెలుపోటములు ఆధారపడి ఉంటాయని విశ్లేషకుల అంచనా. ఈ క్రమంలోనే రాష్ట్రంలో అభ్యర్థిత్వం కోసం తీవ్ర పోటీ నెలకొన్న ప్రతి చోటా కాంగ్రెస్ అధిష్టానం టిక్కెట్ కేటాయింపుపై విస్తృత అధ్యయనం చేస్తున్నట్టు తెలుస్తోంది. దీనిలో ప్రధానంగా ఖమ్మంపైనే ఎక్కువ ఫోకస్ ఉందని సమాచారం.

ఇఫ్తార్ విందు కార్యక్రమంలో సిఎంతో పాటు ఎంపి అసదుద్దీన్ ఒవైసి, షబ్బీర్‌అలీ, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

మాది పక్కా సెక్యులర్ ప్రభుత్వం..

- ముస్లిములకు నాలుగు శాతం రిజర్వేషన్ అమలు చేస్తాం
- ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీక : సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పక్కా సెక్యులర్, ప్రజా ప్రభుత్వ పాలన సాగుతున్నదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పవిత్ర రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఎల్బీస్టేడియంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో ఎంపి అసదుద్దీన్ ఒవైసి, షబ్బీర్‌అలీ, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ముస్లిం మతపెద్దలు, ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి అనాథపిల్లలకు కానుకలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆత్మీయత, మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. విద్య ఉద్యోగాల్లో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు అమలుపరుస్తామన్నారు. వాటిని మోడీ, అమిత్‌షా రద్దు చేస్తామంటున్నారనీ, అది వారి వల్ల కాదని చెప్పారు. వాటిని అడ్డుకోవడం ఎవరికీ సాధ్యం కాదని చెప్పారు. మైనార్టీ పాఠశాలలకు, రెసిడెన్షియల్ భవనాల కోసం ప్రభుత్వం ఇప్పటికే నిధులు విడుదల చేసిందని తెలిపారు. ప్రభుత్వం మైనార్టీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తుందని చెప్పారు. వారికి అండగా ఉంటుందన్నారు. అన్ని వర్గాలకు సమానమైన గౌరవం ప్రజా ప్రభుత్వంలో ఉంటుందని తెలిపారు.

రాష్ట్రంలో వెస్ట్‌సైడ్ 227వ స్టోర్ ఏర్పాటు

హైదరాబాద్ : టాటా గ్రూపులో భాగమైన వెస్ట్‌సైడ్ తన 227వ స్టోర్‌ను తెలంగాణలో తెరిచినట్లు ప్రకటించింది. ఫ్యాషన్ ఔత్సాహికులకు ఆనందాన్ని తీసుకు వచ్చే లక్ష్యంతో హన్మకొండలో కొత్త స్టోర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఈ కొత్త స్టోర్ అసాధారణమైన విలువతో వినియోగదారులకు సమకాలీన, ఆధునిక ఫ్యాషన్ ట్రెండ్‌లను సౌకర్యవంతమైన రీతిలో ఉత్పత్తులను అందించనుందని పేర్కొంది.

సామ్‌సంగ్ నుంచి సరికొత్త 'ఎఐ' వాషింగ్ మెషిన్లు

హైదరాబాద్ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ కొత్తగా 11 కిలోల విభాగంలో ఎఐ ఆధారిత ఆటోమెటిక్ ఫ్రంట్ లోడ్ వాషింగ్ మెషీన్లను ఆవిష్కరించినట్లు తెలిపింది. ఎఐ ఎకోబుబుల్ పేరుతో అందుబాటులోకి తెచ్చిన వీటి ప్రారంభ ధరను రూ.53 వేలుగా నిర్ణయించింది. ఎఐ ఆధారిత క్విక్ డ్రైవ్‌టిఎం సాంకేతికతతో 39 నిమిషాల్లో పూర్తి లోడ్‌ను వాష్ చేస్తాయని ఆ కంపెనీ తెలిపింది.

కొమెడ్ కె ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ : కర్ణాటకలోని 150కి పైగా ఇంజనీరింగ్ కాలేజీలు, దేశంలోని 50 పైగా ప్రయివేటు, డీమ్డ్ యూనివర్శిటీల్లో ప్రవేశాల కోసం కొమెడ్ కె యుగెట్, యుని-గేజ్ ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నట్లు కొమెడ్‌కె ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ డాక్టర్ కుమార్ తెలిపారు. మే 12న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 5లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 200 నగరాల్లోని 400 సెంటర్లలో పరీక్షను నిర్వహించనున్నామన్నారు.

22 నుంచి నిరవధిక సమ్మె

- ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్‌కు నోటీసు అందజేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మూడు నెలల జీతాలు చెల్లించకపోతే ఈ నెల 22 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎఐటియుసి) హెచ్చరించింది. ఈ మేరకు ఆయన యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం నరసింహ నేతృత్వంలో నాయకులు శుక్రవారం హైదరాబాద్ కోఠిలోని ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్ కార్యాలయంలో సమ్మె నోటీసును అందజేశారు.

రుణాలివ్వడం బ్యాంకర్ల సామాజిక బాధ్యత

- ఈము రైతులకు వన్ టైం సెటిల్‌మెంట్ చేయండి
- స్వయం సహాయక సంఘాలకు అధిక రుణాలివ్వాలి
- రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క

రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ 40వ త్రైమాసిక సమావేశంలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బ్యాంకర్లు రుణాలివ్వటం సామాజిక బాధ్యతగా గుర్తించాలని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు హోటల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ 40వ త్రైమాసిక సమావేశానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని ప్రాధాన్యతగా తీసుకుందని చెప్పారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలను ముందుకు తీసుకుపోవటానికి బ్యాంక్లరు సహకరించాలని కోరారు. గత పాలనలో చాలామంది రైతులవి ఇర్రెగ్యులర్ అకౌంట్స్‌గా మారాయని వారికి కొత్తగా రుణాలు ఇవ్వాలన్నారు. రుణాలిచ్చే విషయంలో రైతుల పట్ల నిర్లక్ష్యం, అసహనం ప్రదర్శిస్తే సాగు పెట్టుబడి కోసం రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తారని, రుణ భారం తీరక అప్పులు చెల్లించలేక ఆత్మహత్యలకు దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వారి పట్ల మానవీయ కోణంలో బ్యాంకర్లు వ్యవహరించాలని సూచించారు. వ్యవసాయం, హౌసింగ్, విద్యకు ఇచ్చే రుణాలను బ్యాంకర్లు ప్రాధాన్యతగా తీసుకోవాలన్నారు. వ్యాపారంలో విఫలమైన ఈము రైతులకు రుణాల చెల్లింపుల విషయంలో బ్యాంకర్లు వన్ టైం సెటిల్‌మెంట్ చేయాలని కోరారు. రైతులు, నిరుద్యోగులకు రుణాలిచ్చే విషయంలో బ్యాంకర్లు ఆస్తులను తప్పనిసరిగా తాకట్టు పెట్టుకోవడం సరైంది కాదన్నారు. స్వయం ఉపాధి కోసం యువతకు రుణాలివ్వాలని కోరారు. రాష్ట్రంలో స్వయం సహాయక సంఘంలో ఉన్న మహిళ సభ్యులను కోటీశ్వరులుగా చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా బ్యాంకర్లు స్వయం సహాయక సంఘాలకు అధిక రుణాలి వ్వలన్నారు. రానున్న ఐదేళ్లలో డ్వాక్రా సంఘాల మహిళలకు రూ. లక్ష కోట్లను వడ్డీ లేకుండా ప్రభుత్వం రుణాలు ఇప్పించబోతున్న కార్యక్రమానికి సహకరించాలన్నారు. మహిళలకు ఇచ్చే వడ్డీ లేని రుణాల డబ్బులను బ్యాంకర్లకు ప్రభుత్వం చెల్లిస్తోందని హామీ ఇచ్చారు. ఆంధ్రా బ్యాంకు డైరెక్టర్‌గా తాను ఉన్న సమయంలో విద్య రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు ప్రారంభమయ్యాయని, 20 ఏళ్లు అవుతున్నా ఆ రుణాల జారీలో ప్రగతి కనిపించడం లేదన్నారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ బ్యాంకులను జాతీయం చేసి సంపదను కింది వర్గాలకు తీసుకెళ్లిందన్నారు. సంపద సృష్టికర్తలకు బ్యాంకర్లు తోడ్పాటు అవ్వడం వల్ల రాష్ట్రంలో సృష్టించే సంపద ప్రజలకు పంచవచ్చని వివరించారు. పెట్టుబడులకు హైదరాబాద్ అనువైన ప్రాంతమన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, ఆవుటర్ రింగ్ రోడ్డు మధ్యన ప్రభుత్వం క్లస్టర్లను ఏర్పాటు చేయబోతోందని తెలిపారు. వీటి మధ్యన పరిశ్రమల స్థాపన పెద్ద ఎత్తున ఉండబోతుందన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల్లో ప్రజలకు ప్రాధాన్యత ఉన్న వాటిని గుర్తించి ముందుకు తీసుకెళ్లడానికి బ్యాంకర్లు సహకరించాలని కోరారు. రుణాలిచ్చే విషయంలో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు బ్యాంకులు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. దేశ సంపద రైతులనీ, ఆర్థిక వ్యవస్థలో ప్రధానం వ్యవసాయమని చెప్పారు. దేశంలో వ్యవసాయం సంక్షోభంలోకి పోతే ఆహార కొరత ఏర్పడే ముప్పు ఉందన్నారు. అందుకనే రైతులను ప్రోత్సహించాలని కోరారు. రాష్ట్రంలో విచిన్నమైన వ్యవస్థలను సరి చేసి ప్రజల ఆర్థిక అవసరాలను తీర్చాలనే లక్ష్యంతో, అంకితభావంతో పనిచేస్తున్న ఈ ప్రభుత్వ ప్రాధాన్యతలను గుర్తించి ఆ లక్ష్యాలను చేరుకునే విధంగా బ్యాంకర్ల పనితీరు ఉండాలని సూచించారు. రాష్ట్రంలో డిమాండ్‌కు తగ్గట్టుగా పాల ఉత్పత్తి లేదనీ, పాడి పరిశ్రమ నెలకొల్పడానికి ముందుకు వచ్చే రైతులకు బ్యాంకర్లు రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని కోరారు. . బ్యాంకింగ్ వ్యవస్థ నిబద్ధతగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లో కలుషితం కావొద్దని హితవు పలికారు. వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తే సమాజాన్ని విచ్ఛిన్నం చేసినట్టే అవుతుందన్నారు. ఆనంతరం పట్టు గూళ్ల పెంపకం రైతులకు రూ.1,83,41వేల ప్రోత్సాహక చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎస్‌బిఐ సిజిఎం రాజేష్‌కుమార్, ఎస్ఎల్‌బిసి కన్వీనర్ మిత్ర, నాబార్డ్ జీఎం పిపి ఉషా, అధికారులు శారధ, జగదీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి త్రిసభ్య కమిటీ

- చిన్నారెడ్డి నేతృత్వంలో ఏర్పాటు
- సభ్యులుగా కోదండరామ్, దివ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలతోపాటు ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఇచ్చిన వినతులను పరిశీలించి పరిష్కరించేందుకు ముగ్గురు సభ్యులతో ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి కమిటీ వేశారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మెన్ జి చిన్నారెడ్డి నేతృత్వంలో టిజెఎసి మాజీ చైర్మన్, రిటైర్డ్ ప్రొఫెసర్ కోదండరామ్, ఐఎఎస్ అధికారి దివ్యను సభ్యులుగా నియమించారు. ఈనెల 10న రాష్ట్రంలోని వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలో ప్రత్యేకంగా సమావేశమైన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా సంఘాల ప్రతినిధులు ఇచ్చిన విజ్ఞప్తులు, వినతులన్నింటినీ పరిశీలించి, ఉద్యోగుల సమస్యల పరిష్కరిస్తామని హామీ ఇచ్చామని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటిని పరిశీలించి సాధ్యాసాధ్యాలు, పరిష్కార మార్గాలను సూచించే బాధ్యతను త్రిసభ్య కమిటీకి అప్పగించామని పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాలు ప్రస్తావించిన అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని పరిష్కరించే దిశగా సలహాలు సూచనలతో నివేదికను అందజేయాలని ఆ కమిటీకి సిఎం సూచించారు.

విశ్రాంత నౌకా దళాధిపతి రాందాస్ మృతికి సిఎం సంతాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విశ్రాంత నౌకా దళాధిపతి అడ్మిరల్ లక్ష్మీనారాయణ్ రాందాస్ మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం సిఎంఒ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. పదహారేండ్ల వయస్సులోనే 1949లో సంయుక్త సైనిక దళాల్లో చేరి అంచెలంచెలుగా ఎదిగి దేశ రక్షణ విభాగంలో అత్యున్నత పదవిని అలంకరించారని పేర్కొన్నారు. 1971 ఇండియా-పాకిస్తాన్ యుద్ధ సమయంలో వీరోచితంగా పోరాడారని గుర్తు చేశారు. ఆయన మృతి దేశానికి తీరని లోటని పేర్కొన్నారు. రాందాస్ పట్ల కుటుంబ సభ్యులకు సిఎం ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మూత్రపిండాల వ్యాధుల బారిన యువత

- మధుమేహమే ప్రధాన కారణం
- విరించి నెఫ్రాలజీ హెడ్ డాక్టర్ కెఎస్ నాయక్

ప్రజాశక్తి - హైదరాబాద్

యువత మూత్రపిండాల వ్యాధి బారిన పడుతున్నారని విరించి హాస్పిటల్ నెఫ్రాలజీ అండ్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగాధిపతి డాక్టర్ కెఎస్ నాయక్ తెలిపారు. దీనికి 'క్రానిక్ కిడ్నీ డిసీజ్ ఆఫ్ అన్ నోన్ ఆరిజిన్' కారణమన్నారు. ఇది మూత్రపిండాల ఆరోగ్యంపై గణనీయమైన ప్రభావం చూపుతుందన్నారు. దీని మూలాలు అస్పష్టంగా ఉన్నప్పటికీ యువకులలో తీవ్రమైన అనారోగ్యానికి దారి తీస్తుందన్నారు. ఇది తీవ్రంగా ఆందోళన కలిగించే అంశమన్నారు. కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని విరించి హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణాలో దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధికి మధుమేహం ప్రధాన కారణమన్నారు. భారతదేశంలో 2020లో నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైందన్నారు. అనేక ఇతర వ్యాధులకూ మధుమేహమే కారణమని చెప్పారు. మూత్రపిండాల వ్యాధి బారినపడుతున్న వ్యక్తుల సగటు వయస్సు 50 సంవత్సరాలు అన్నారు. అందులో 67 శాతం పురుషులని తెలిపారు. దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి సాధారణ లక్షణాలు వ్యాధి దశపై ఆధారపడి మారవచ్చని సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ నవీన్ కుమార్ మట్టెవాడ అన్నారు. మూత్ర విసర్జన తగ్గడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, మూర్ఛలు, కొన్నిసార్లు ఆకస్మికంగా గుండె ఆగిపోవచ్చని తెలిపారు.

ధాన్యం తాజా టెండర్లతో రూ.1,110 కోట్ల లాభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాజా టెండర్లలో గతం కన్నా ఒక్కో మెట్రిక్ టన్నుకు రూ.3 వేలు అదనంగా టెండర్లు దాఖలయ్యాయి. ఈ లెక్కన పౌరసరఫరాల శాఖకు రూ.1,110.51 కోట్లు అదనంగా సమకూరనుంది. కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ) ప్రకారం మెట్రిక్ టన్ను ధాన్యం ధర రూ.20,600. గతంలో టెండర్లు పిలిచి మెట్రిక్ టన్నుకు రూ.17,015.19కు టెండర్లు ఖరారు చేశారు. ఆ లెక్కన 34.59 లక్షల మెట్రిక్ టన్నులకు పౌరసరఫరాల శాఖకు రూ.5,885.55 కోట్లు రావాల్సి ఉంది. ఎమ్మెస్పీ ప్రకారం చూస్తే రూ.1,239.99 కోట్లు పౌరసరఫరాల శాఖ నష్టపోయే పరిస్థితి. అంత తక్కువకే టెండర్లు దక్కించుకున్న కొనుగోలుదారులు ఆ మొత్తం చెల్లించేందుకూ ముందుకు రాలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పాత టెండర్లు రద్దు చేసి మళ్లీ టెండర్లు పిలిచారు. తాజా టెండర్లలో మెట్రిక్ టన్నుకు రూ.20,225.67కు టెండర్ దాఖలైంది. పాత టెండర్‌తో పోలిస్తే ఇది ఒక్కో మెట్రిక్ టన్నుకు రూ.3,210.48 అదనం. ఈ లెక్కన మొత్తం 34.59 లక్షల మెట్రిక్ టన్నులకు తాజా టెండర్ ప్రకారం రూ.6,996.06 కోట్లు రాబడి సమకూరనుంది. పాత టెండర్ల రాబడితో పోలిస్తే ఇది రూ.1,110.51 కోట్లు అదనం.

'రీటా నేర్పిన పాఠం' పుస్తకం స్ఫూర్తిదాయకం

- ఐద్వా జాతీయ నాయకురాలు పుణ్యవతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

'రీటా నేర్పిన పాఠం' పుస్తకం ఎంతో స్ఫూర్తిదాయకమైందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ నాయకురాలు ఎస్ పుణ్యవతి అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐద్వా జాతీయ ఉపాధ్యక్షురాలు సుధా సుందరరామన్ శుక్రవారం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పుణ్యవతి మాట్లాడుతూ బందా కరత్ తన యవ్వన ప్రాయనంలోనే దేశంలోని వివిధ సమస్యలపై స్పందించారని చెప్పారు. ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. ఆ పుస్తకంలో ప్రతి అంశం మహిళా ఉద్యమాలకు ప్రేరణగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, అధ్యక్షురాలు అర్, అరుణజ్యోతి, ఉపాధ్యక్షురాలు టి. జ్యోతి, కె.ఎన్. ఆశాలత, రత్నమాల, సరళ, డి. ఇందిర, ఎమ్, భారతి, ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథపై విజిలెన్స్ దృష్టి

- రాష్ట్ర కార్యాలయంలో సోదాలు
- గణాంక అధికారితో భేటి
- సమాచారం కోసం లేఖ
- రికార్డులు సమర్పించాలని ఆదేశం
- ఇప్పటికే నిజామాబాద్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఆయా ప్రభుత్వ శాఖల కార్యకలాపాలపై దృష్టిపెట్టింది. పాత బిఆర్‌ఎస్ సర్కారు హయాంలో చేపట్టిన ప్రాజెక్టులు, పథకాల్లో చోటుచేసుకున్న అవినీతిని వెలికితీసేందుకు సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే సాధారణ పరిపాలన శాఖ (జిఎడి) పరిధిలో పనిచేసే విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖకు ఆదేశాలు జారీచేశారు. అక్రమాలను బయటపెట్టి విచారణ చేయడం ద్వారా ఎన్నికల్లో ప్రజలకు చెప్పిన వాగ్దానాలను నెరవేర్చాలనే ఆశాభావంతో భావిస్తోంది.

ఇప్పటికే సాగునీటిపారుదల శాఖలో విజిలెన్స్ నివేదిక ఆధారంగా ఇద్దరు ఉన్నతాధికారులను ఇంటికి పంపిన ప్రభుత్వం, తాజాగా మిషన్ భగీరథలో తీగలాగేందుకు సిద్ధమైంది. రాష్ట్రంలోని పౌరులందరికి ఉచితంగా తాగునీటిని అందించేందుకుగాను బిఆర్‌ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ ప్రాజెక్టును చేపట్టి పూర్తి చేసింది. దాదాపు రూ.35,300 కోట్లు ఖర్చు చేసింది. అయితే ఇందులో అవినీతి,అక్రమాలు జరిగాయని

అరోపణలు, విమర్శలు వచ్చిన నేపథ్యంలో విచారణకు శ్రీకారం చుట్టింది. సహకరించాలంటూ మిషన్ భగీరథ ఇంజనీర్ ఇన్ చీఫ్‌కు గురువారం లేఖ రాసింది. ప్రాజెక్టు టెండర్ల ప్రక్రియకు సంబంధించి రికార్డులు అందజేయాలని విజిలెన్స్ శాఖ కోరింది. నోట్ ఫైళ్లు, టెండర్ ఎవాల్యూయేషన్, టెండరు కమిటీ అనుమతులు, లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్స్(ఎల్‌ఓఏ) తదితర దస్త్రాలను విచారణకు సమకూర్చాలని కోరింది. ఇంట్రా విలేజ్ నెట్‌వర్క్‌కు చెందిన సర్క్యులర్లు, జిఒలు ఇతర సమాచారం పంపాలని పేర్కొంది. గత వారం రోజులుగా విజిలెన్స్ విచారణ సాగుతున్నది. తొలుత నిజామాబాద్ ఎస్‌ఈ కార్యాలయంలో విచారించారు. ఆయా పనులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. జీరాక్స్ కాపీలను తీసుకున్నారు. అక్కడ జరిగిన పనులు, వ్యయం, ఏ మేరకు అవినీతి జరిగిందనే విషయమై ఆరా తీశారు. అలాగే తాజాగా రాసిన లేఖలో నిజామాబాద్‌తోపాటు ఆదిలాబాద్, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు చెందిన కాంట్రాక్టులు, ఇతర వివరాలను విజిలెన్స్ విభాగం అడిగింది. సోలార్ పథకాల్లో జరిగిన అక్రమాలకు సంబంధించి వివరాలను ఇవ్వాలని భగీరథ శాఖను కోరింది. కాంట్రాక్టర్ల భౌతిక, ఆర్థిక పరిస్థితులకు సంబంధించి అంశాల్లో స్పష్టత అవసరం అని పేర్కొంది. ఆడిట్ పేరాల పరిశీలన, సమాధానాల సమాచారం కావాలని అడిగింది.

ఈ మేరకు విజిలెన్స్ ఎస్‌పి సిహెచ్ శృత కీర్తి, మిషన్ భగీరథ ఇఎన్‌సికి లేఖ రాశారు. కాంట్రాక్టర్లకు పనుల అప్పగింత రికార్డులను ఇవ్వాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లోని 26 సెగ్మెంట్లల్లో భగీరథ పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. పనులు జరిగిన తీరు, బిల్లుల మంజూరు, పనులు ఇచ్చిన విధానం తదితర అంశాలపై గత వారం రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సోదాల్లో విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తోంది. గురువారం భగీరథ రాష్ట్రకార్యాలయానికి ఇద్దరు విజిలెన్స్ అధికారులు వచ్చి విచారించారు. గణాంక అధికారితో ప్రాజెక్టు వ్యయం, అప్పులు, వడ్డీ తదితర అంశాలపై ఆరా తీశారు. సమాచారం కావాలని అడగడం మినహా ఫైళ్లేవీ స్వాధీనం చేసుకోకపోవడం గమనార్హం.

పనిభారం తగ్గించాలి.. వేధింపులు ఆపాలి

- ఆర్‌టిసిలో ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలి
- నేటి నుంచి ఖమ్మంలో ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభ
- హాజరు కానున్న డిప్యూటీ సిఎం భట్టి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని,
- యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసి కార్మికులపై విపరీతమైన పనిభారం పడుతుందని, విధుల నిర్వహణ కత్తిమీద సాములా మారిందని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు పని భారాన్ని తగ్గించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షులు ఎస్.బాబు తెలిపారు. శుక్రవారం ఖమ్మంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌టిసిలో ట్రేడ్ యూనియన్ల ఉనికి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. నిరంకుశంగా నియంతలా వ్యవహరించిన కెసిఆర్ ప్రభుత్వం ట్రేడ్ యూనియన్లను రద్దు చేసిందని, కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్‌టిసిలో ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం వేధింపులు కూడా కార్మికులపై పెరిగాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌టిసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ తక్షణం అపాయింట్‌మెంట్ డేట్ ప్రకటించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భారతీయ వాహన చట్టంతో డ్రైవర్లు పనిచేయలేని పరిస్థితి ఉందని, ఆ చట్టాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్‌టిసి ప్రయాణీకులు పెరిగారని, అందుకు తగ్గట్టు సిబ్బందిని, బస్సుల సంఖ్యను పెంచాలని కోరారు.

నేటి నుంచి రాష్ట్ర మహాసభ

ఖమ్మంలోని టిఎన్‌జిఓఎస్ ఫంక్షన్ హాల్‌లో శని, ఆదివారం నిర్వహించనున్న ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ (ఎఐటియుసి) 3వ రాష్ట్ర మహాసభలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కొత్తగూడెం శాసనసభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రారంభిస్తారని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని డిపోలకు, రీజియన్లకు ప్రాతినిధ్యం వహిస్తూ 250 మంది ప్రతినిధులు హాజరు కానున్నారని, ఈ మహాసభలో ఆర్‌టిసి కార్మికుల సమస్యను చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్టు చెప్పారు. విలేకరుల సమావేశంలో ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు వెంకటగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ. వెంకన్న, రాష్ట్ర నాయకులు తిమ్మినేని రామారావు, పాటి అప్పారావు, ఖమ్మం రీజియన్ కార్యదర్శి పిల్లి రమేష్, ఎఐటియు జిల్లా కార్యదర్శి తోట రామాంజనేయులు, యూనియన్ నాయకులు బుచ్చిబాబు, బీవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.